N. S. NARASU, M. A., LL. B.
EDUCATION OFFICER

# తండ్రులూ—కొడుకులూ

తన వివాహానికి వచ్చిన యితర బంధువులతోపాటు పెద తండ్రిని వెళ్ళనివ్వ లేదు కుటుంబరావు. పదిరోజులు ఉండి వెళ్లమని కోరాడు. ఆయనకూడా కుటుంబరావుమాట తీసి వెయ్యలేక ఆగాడు.

తన పెదతండ్రిని చూచి కుటుంబరావు చాలా బాధ పడ్డాడు ఒకప్పుడు ఆయనకు వంద ఎకరాల సేద్యం వుండేది. స్టేషనుదగ్గర ఒక ధాన్యపు ఫ్యాక్టరీ; ఊళ్లో ఒక బట్టలకొట్టు ఉండేవి. ఆ చుట్టుప్రక్కల ఆయనమాట అప్రతిహతంగా చెల్లి పోతూ వుండేది. చెరువుగట్టుమీద నిలబడి వొక్క గద్దింపు గద్దిస్తే ఊరు ఊరు గజగజ వణికిపోయేది. అటువంటి మనిషి యిటీవల చాలా కష్టాలు పడుతున్నాడని విన్నాడు కుటుంబ రావు. ఆస్థి చితికిపోయింది. చెట్టంత కొడుకుండీ ప్రయోజనం లేకపోయింది. ఆ కొడుకు తల్లిదండ్రుల పోషణకు దమ్మిడీ

యివ్వనని చెప్పాడట. కొడుకే ఈ విధంగావుంటే ఇక అల్లుళ్ల సంగతి వేరే చెప్పాలా?

ఈసంగతులన్నీకుటుంబరావుకి కర్ణాకర్ణికగా మాత్రమే తెలిసినై. కుటుంబరావు తండ్రి డాక్టరు ప్యాసై, స్వగ్రామం విడిచిపెట్టి మద్రాసులో ప్రాక్టీసు చేస్తున్నాడు. అప్పటినుంచీ బంధువుల రాకపోకలు తగ్గినై. అందువల్ల మారుమూలవున్న తన స్వగ్రామంలో జరిగే సంగతులు వాళ్లకు కర్ణాకర్ణికగా మాత్రమే తెలుస్తున్నై.

కుటుంబరావుకి తన అన్న ప్రవర్తన అర్థంకాలేదు. తనకు జ్ఞాపకం ఉన్నంతవరకు ఆయనకఠినుడుకాదు. తనచిన్నతనంలో తాను స్వగ్రామంలో ఉంటున్నప్పుడు ఆయనకవిత్వం వ్రాస్తుండేవాడు. తమది కవితా కుటుంబం. ఏ పరిస్థితుల్లోనూ ఆ గౌరవాన్ని నిలబెట్టాలని ఆయన పట్టుదల. రఘువంశం, మేఘసందేశం చదువుతూ, వాటిఘనతను అందరికీ చెబుతుండే వాడు. తనకు మనుచరిత్ర చదివి అర్థంచెప్పేవాడు. బ్రాహ్మణ్ణే తరుడవటం మూలాన భట్టుమూర్తి పడిన కష్టాలూ, ఇతర కవులవల్ల పొందిన అవమానాలూ చెప్పి కంటతడి పెట్టుకునే వాడు. ఇంటిపని ముట్టుకునేవాడుకాదు. తన పెద్దతండ్రికూడా యింటిపను లేవీ కొడుక్కి చెప్పేవాడుకాదు. కొడుకు యశస్సు నార్జించాలనే ఆయన కోర్కెకూడాను.

అప్పటికి తన అన్న స్కూలుఫైనలుచదువుతున్నాడు. రాకపోకలకు తన కొడుకు ఎక్కడ యిబ్బందిపడతాడోనని టౌన్లోనే ఒక యిల్లు అద్దెకు తీసుకొని ప్రత్యేకం వంటవాణ్ణి

పెట్టాడు తన పెదతండ్రి. ఆ రోజుల్లో కొడుకుని చూచుకొని మురుసుకోవటం తప్ప మరొకపని వుండేదికాదు పెదతండ్రికి. కొడుకు కోసం ఎంత డబ్బయినా ఖర్చుపెట్టేవాడు. తనకి బాగా జ్ఞాపకం. ఒకరోజున తన పెదతండ్రి కొడుకుని చూట్టానికని హైస్కూలికి వెళ్లాడు. ఆ హైస్కూలులోనే పక్కనున్న జమీందారుకొడుకు ఒకడు చదువుకుంటున్నాడు! అతను వేసుకున్న దుస్తులుచూచి కొడుక్కి అటువంటి దుస్తులు లేవని విచారపడి, వెంటనే బజారువెళ్ళి ఆ జమీందారు కొడుకు ధరించిన దుస్తులకంటే విలువైన దుస్తులుకొన్నాడు కొడుక్కి. క్లాసురూములో ఆ జమీందారు కొడుక్కి ప్రత్యేకం ఒక కుర్చీ వేసేవారు. అట్లాగే తనకొడుక్కికూడా కుర్చీ వేయించవలసిందని హెడ్మాష్టర్ని అడిగాడు. 'నాకొడుక్కంటే వాడి గొప్పేమిటి?' అని పోట్లాడాడు.

ఇటువంటి తండ్రీ కొడుకుల మధ్య మనస్పర్థ యెలా వొచ్చిందో కటుంబరావు వూహకు అందలేదు. పోనీ తనపెదతండ్రి తప్పేమన్నా వున్నా, తన్నంత ప్రేమగా పెంచాడా తండ్రీ, కొంచెం విశ్వాసం అయినా ఉండక్కర్లా అన్నకి? తన్ను పెంచి, విద్యాబుద్ధులుచెప్పించి పెద్దవాణ్ణి చేసిన తండ్రి తిండిలేక అల్లాడిపోతుంటే చూస్తూఊరుకోటానికి తన అన్నకు మనస్సెట్లా వొప్పింది?

పోనీ అతనుకూడా డబ్బులేక యిబ్బందిపడుతున్నాడా అంటే కాదాయె! అతనికి భార్యతరఫునుంచి ఆస్తి వొచ్చింది. తనేమో మాష్టరీ ఉద్యోగంచేసి సంపాదిస్తున్నాడు. మరెం

దుకు తల్లిదండ్రుల్ని యిలా కష్టపెట్టటం? 'తను ఏమీ సంపాదించాడని మేము పెట్టాలి?' అంటున్నాడట! ఏమిఅన్యాయం! తండ్రిని పోషించే సందర్భంలోకూడా వ్యాపారదృష్టా?

కుటుంబరావుకు పెదతండ్రిని అడిగి సంగతి సందర్భాలన్నీ తెలుసుకోవాలనిపించింది. ఇంతవరకు తన అన్నని గురించి యితరులు చెప్పినమాటలు విన్నాడు. వాళ్ళు నిజం చెప్పాలని ఎక్కడ ఉంది! అపవాదు పుట్టించి, దానికి తమ ముక్కలను తగిలించి ఆనందించే జనం యెక్కువ ఆంధ్రదేశంలో! కాబట్టి యదార్థం తెలుసుకోవటం మంచిది.

"పెదనాన్నా!"

"ఏమిటి నానాయనా?"

"నిన్నొకటి అడగాలనివుంది."

"ఏమిటి నాయనా?–"

"అన్నయ్య సంగతి" అన్నాడు కుటుంబరావు.

కొడుకు సంగతి ఎత్తేటప్పటికి ఆయన తల వంచుకున్నాడు. ఆ సమయంలో ఆయన కుటుంబరావుకి పేలి ఆరిన అగ్నిపర్వతంలాగా, కాలిపోయిన మతాబులాగాకనిపించాడు. కొంతసేపటికి ఆయన వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లు అనుమానం కలిగింది. కుటుంబరావు గుండె గుభేలుమన్నది.

"ఊరుకో పెదనాన్నా" అన్నాడు.

ఆయన శోకాన్ని దిగమింగాడు. ఒక్క నిట్టూర్పు విడిచి, "వాడి సంగతి అడక్కు నాయనా–కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది."

కుటుంబరావు మాట్లాడలేదు. కదిలించి పుండుమీద కారం జల్లటం అన్యాయం అనుకొని ఊరుకున్నాడు. కొంచెం సేపు చూచి పెదతండ్రే అన్నాడు.

"వాడు మంచివాడే నాయనా."

"మరి వదినో."

"నా కుటుంబంలో చిచ్చుపెట్టిందే అది. మమ్మల్ని గడప తొక్కనివ్వదు. మాకు దమ్మిడీ యిస్తే వూరుకోదు"

"అన్నయ్య అవిడమాట వింటాడా?" అని అడిగాడు కుటుంబరావు.

"అడుగుదాటడు."

"ఎందుకని?"

"మా కర్మ. వాడినని ఏం ప్రయోజనం. అసమర్థుడు అనుకోవాలి అంతే. పెళ్లాం మాటలు విని తల్లిదండ్రుల్ని తమిరిమివేసేవాళ్ళకు పుట్టగతులుంటాయా నాయనా?" ఈ విధంగా మొదలుపెట్టి నెమ్మది నెమ్మదిగా తన కథ అంతా చెప్పాడు. పెదతండ్రి ఆయన తన కొడుకుమీద నిందలు మోపటం యిష్టంలేనట్టు కనిపించాడు. "నువ్వూ నా కొడుకుతో సమానమే. నీతో చెప్పుకుంటే తప్పేముంది" అని తన కథ అంతా చెప్పాడు.

అంతవరకూ తమను అత్యంత భక్తితో చూసేకొడుకు భార్య కాపరానికి రాగానే మారిపోయాట్ట. 'బట్టలకొట్టు ఎందుకు పెట్టావు? ఫ్యాక్టరీ ఎవరు కట్టించమన్నారు?' అని అడిగేవాడట! 'మా చదువుకి యింత ఎందుకు ఖర్చుపెట్టావు? తాహతుకి మించిన పనులు ఎవ్వరు చెయ్యమన్నారు?' అని

అడిగేవాడట తనకు అత్తగారు కట్నంగా యిచ్చిన డబ్బు యిమ్మని పోట్లాడేవాడట. అతని పోట్లాట భరించలేక, కాపురం ఎక్కడ రచ్చకెక్కుతుందో అనే భయంతో పూర్వులు కట్టించిన మేడ కోడలుపేర వ్రాసిచ్చాడట పెదతండ్రి. మర్నాడే తమను యింట్లోనుంచి వెళ్ళగొట్టి వేశారట. అప్పటినుంచీ పక్కవూళ్లో ఒక గుడిసె అద్దెకుతీసుకొని అక్కడ కాలక్షేపం చేస్తున్నాడట. ఉండబట్టలేక యెప్పుడన్నా కొడుకుని చూచిపోదామని వస్తే కస్సుబుస్సు మంటారట. మనమణ్ణి దగ్గరకు రానివ్వరట! ఒకపూట భోజనంకూడా పెట్టరట! 'అదుగో తినిపెట్టడానికి వచ్చాడు' అని చుట్టుపక్కల వాళ్ళందరికీ తన్ను చూపుతుందట కోడలు. ఈ సంగతులన్నీ చెప్పి కంట నీరు పెట్టుకున్నాడు పెదతండ్రి. "ఇది న్యాయమేనా నాయనా? పెళ్లాంమాటలు విని తల్లిదండ్రుల్ని ఇలా చెయ్యటం? అందులో అది ఎవరనుకున్నావు?— దుక్కముక్కలవారి ఆడపడుచు. దానికి మనం అంటేనే గిట్టదు. వాళ్ళకీ మనకి వున్న విరోధాలు మనస్సులో పెట్టుకొని ఈ విధంగా సాధిస్తూ వుంది. దానికి లొంగటమా?" అన్నాడు రోషంతో, కోపంతో. అయన శరీరం వొణికింది.

దుక్కముక్కల వాళ్ళసంగతి జ్ఞాపకం రాగానే పెదతండ్రికి కోపం రావటం కుటుంబరావుకి అర్థం అయింది. చింత చచ్చినా పులుపు చావలేదు అనుకొని సంతోషించాడు. తమ వూళ్లో అనాదినుంచీ రెండు పార్టీలున్నాయి. ఒక పార్టీకి దుక్కముక్కలవాళ్ళు-రెండో పార్టీకి నాయకులు తనవాళ్లు-

తన పెదతండ్రి. దుక్కా-ముక్కాలవాళ్ళు డబ్బు మనుష్యులు. డబ్బు సంపాదించటంకంటే మరొకదృష్టి వాళ్ళకులేదు. తనవాళ్ళు ధనవంతులూ, సంస్కారులు. 'దుక్కా-ముక్కాల వాళ్ళు దమ్మిడీకి గడ్డితింటారు. వాళ్ళబతుకూ ఒక బతుకేనా' అనేవాళ్ళు తనవాళ్ళు. 'మర్యాదా మన్ననా లేనివాళ్ళు గర్వోన్మత్తులు' అని తనవాళ్ళని దుక్కా-ముక్కాలవాళ్ళు నిందించేవాళ్ళు. 'తట్ట తగలవేసుకునే బాపతు' అనేవాళ్ళు. ఈవిధంగా తన వూళ్ళో చాలా కాలంనుంచీ రెండుపార్టీలుండటం కుటుంబరావుకు తెలుసు. దుక్కాలముక్కాల వాళ్ళని తనవాళ్ళు పురుగుల్ని ఏరిపారవేసినట్లు పారవెయ్యటం అతనికి తెలుసు. కాని ఇది చాలా కాలంనాటి సంగతి, ఇటీవల పరిస్థితులు మారినై. అందని హోదాలకుపోయి తనవాళ్ళ కుటుంబాలను ఆర్థికంగా చితికిపోయినై. జాగ్రత్తగావుండి దుక్కా-ముక్కాల వాళ్ళు ధనవంతులయ్యారు క్రమక్రమేణా ఊళ్లో పలుకుబడి సంపాదించారు. లైబ్రరీవాళ్ళ చేతుల్లోకే వెళ్ళింది. స్కూలు వాళ్ళ చేతులలోకే వెళ్ళింది. పంచాయితీబోర్డు వాళ్ళ చేతులలోకే వెళ్ళింది. వాళ్ళలోనే చదువుకున్నవాళ్ళు బయలుదేరారు. పండితులు బయల్దేరారు. అంతకుముందు తనవాళ్ళకు వొదిగి వొదిగి వుండేవాళ్ళు-తనవాళ్ళను నిర్లక్ష్యం చేయ మొదలుపెట్టారు. మాటకు మాట అంటం మొదలుపెట్టారు. ఈ ప్రవర్తన తనవాళ్ళకు చాలా అవమానకరంగా వుండేది. హృదయాలలో నిప్పులు రాజినై. అటువంటి వాళ్ళమీద తన పెదతండ్రికి ఏహ్యభావం ఉండటం, వాళ్ళపేరు తలిస్తే రోషపూరితుడవ

టం కుటుంబరావుకి తప్పుగా కనిపించలేదు. ఈ పరిస్థితులన్నీ ఆలోచించకుండా దుక్కముక్కలవారి ఆడపడుచుని వెనక వేసుకొచ్చి,తల్లిదండ్రుల్ని బాధపెడుతున్నందుకు అన్నమీద కోపం వచ్చింది. తనభార్య తరఫు చుట్టాలనేగాని, తనవాళ్ల నెవ్వరినీ యింటికి రానివ్వటం లేదనికూడా విన్నాడు. అటు వంటివాడు భార్య రాగానే యిలా ఎందుకు మారిపోయాడో అతనికి అర్థంకాలేదు. ఏదైనా తన జన్మకు కారకులైన తల్లి దండ్రులనే క్షోభ పెట్టటం దారుణం.

"ఇంకేం చెయ్యదలిచావు పెదనాన్నా" అనిఅడిగాడు.

"ఏముంది నాయనా చెయ్యటానికి!వాడు పనికిమాలిన వాడయ్యాడనే చింత తప్ప మమ్మల్నిగురించి మాకెప్పుడూ చింతలేదు. మా జీవితాలు మెల్లాగో వెళ్లమారిపోతై..." అన్నాడు.

"ఉన్న యిల్లుకూడా ఆయనకే యిస్తివి."

"ఇచ్చానుబాబూ. వాడు నోరుతెరచుకొని అడిగితే కాదనలేకపోయాను. అంతవరదాకా యెందుకు? మన వూళ్లో మీ పెద్దమ్మ [illegible]ర వున్న ఎకరం అమ్మి, యిప్పుడు నేను వుంటున్న వూళ్ళో పది ఎకరాలు కొన్నాను. బంగారంవంటి భూమి. మురుగు వస్తుంది. వొక్క వందరూపాయలు ఖర్చు పెడితే రాజనాలు పండుతై. నా దగ్గర డబ్బులేదు. 'వంద రూపాయలు యివ్వు నాయనా! ఇక దమ్మిడీ అడగను?' అని వాణ్ని అడిగాను. వాణ్ని అడగటం నా కిష్టంలేదు. మీ పెద్దమ్మ పోరుపడలేక అడిగాను. వాడేమన్నాడో తెలుసా

నాయనా? 'ఆ పది ఎకరాలు నా పేర పెట్టు, అలాగే యిస్తాను' అన్నాడు-బాబూ. నేను అందుకు వొప్పుకున్నా. 'అట్లాగే ఇస్తాను. మాకు సంవత్సరానికి యింత యిస్తానని వ్రాసి యివ్వు' అని అడిగాను నాయనా! ఇక చూడు. నా మీద ఇంత ఎత్తున లేచాడు."

'నామాట నమ్ము' అన్నాడు. నాయనా పోయింది పోగా ఈ పది ఎకరాలకోసం తగాదా ఎందుకని నేను 'సరే' అందాం అనుకొన్నాను! మీ పెద్దమ్మ వీలులేదని పట్టు పట్టుకు కూర్చుంది. దాని సొంత ఆస్తి ముప్పైవేలదాకా ఖర్చుపెట్టాను నాయనా. ఎన్నడూ ఒక్కమాటయినా అని యెరుగదు, మరి అప్పుడు దానికేం వచ్చిందో వీలులేదని పట్టుపట్టి కూర్చుంది..."

"మంచిపని చేసింది" అన్నాడు కుటుంబరావు.

"మంచిపనే అంటావా నాయనా" అని ఆతురతతో అడిగాడు పెదతండ్రి.

"చాలా మంచిపని, లేకపోతే ఆ ఆధారంకూడా లేకుండాపోయేది" అన్నాడు కుటుంబరావు.

"పదిఎకరాలూ తీసుకొని మళ్లీ డబ్బివ్వకుండా మమ్మల్ని కష్టపెట్టేవాడంటావా నాయనా?" అని ఆశ్చర్యంగా అడిగాడు.

పెదతండ్రి అమాయకత్వానికి కుటుంబరావుకి చాలా విచారం కలిగింది. "ఆహా, అందుకు సందేహమా! ఇన్ని చేసినవాడు అదిమాత్రం చెయ్యడూ!" అన్నాడు.

పెదతండ్రి ఆలోచనలో పడ్డాడు. ఆయనకు కొడుకు మీద విశ్వాసం యింకా పూర్తిగా పోయినట్లు లేదు. అది పోయేటట్టుగా కూడ లేదు. ఎంత అన్యాయం చేసినా యెప్పటికప్పుడు "ఇంత అన్యాయం చేస్తాడా, తండ్రినే" అనే భావం ఆయనకు పోతున్నట్లు లేదు. కొడుకు విడిపోవటం, కొడుక్కీ తనకూ సంబంధం లేదు అనుకోవటం తండ్రులకు ఎంతకష్టమో తిన పెదతండ్రిని చూస్తుంటే తెలిసింది కుటుంబరావుకు.

"పెదనాన్నా!" అని అతి ఆప్యాయంగా పలకరించాడు.

"ఏం నాయనా!"

"పందరూ పాయలుంటే పొలం బాగుపడుతుంది కాదూ!"

"నిక్షేపంలాగా బాగుపడుతుంది నాయనా!"

"నువ్వు ఒకళ్ళమీద ఆధారపడవలసిన అవుసరం లేకుండా పోతుంది కదూ!"

"నే ఒకళ్ళకు పెట్టగలుగుతాను" అన్నాడు పెదతండ్రి. ఈ మాటలు అంటూ ఉండగానే ఆయన కళ్ళల్లోకి తేజస్సు వచ్చింది. భారతదేశపు ఔన్నత్యం ఆయన కళ్ళల్లో కనిపించింది—కుటుంబరావుకి.

పెదతండ్రి ఆరోజే స్వగ్రామానికి ప్రయాణం అయ్యాడు. ఆయనకు కుటుంబరావు రెండువందల రూపాయ లిచ్చాడు. ఆయన ఆ డబ్బు తీసుకుని, "నీకూ పెళ్ళి అయింది. నీ అన్నకిమల్లేభార్యని వెనకేసుకొచ్చి తల్లిదండ్రుల మనస్సుకి కష్టంగలుగ జెయ్యకు నాయనా!" అన్నాడు.

* * *

ఇది జరిగి రెండు సంవత్సరాలయింది. ఈ రెండు సంవత్సరాలలో మార్పు లనేకం జరిగినై! కుటుంబరావు భార్య కాపురానికి వచ్చింది. అతనికి ఉద్యోగం రావటం, వెంటనే భార్యతో చిత్తూరులో కాపురంపెట్టడమూ జరిగింది. మధ్యలో ఒకటి రెండు సారులు తలిదండ్రులను చూచిపోవటానికి వచ్చాడుగాని భార్యనువిడచి యెక్కువరోజులు వుండలేకపోయాడు. వెంటనే తిరిగి వెళ్ళాడు. తరువాత తండ్రి ఒకసారి రమ్మని ఉత్తరం వ్రాసినా వెళ్ళలేదు దీనికి కారణం తీరికలేక కావచ్చు. భార్య నేను వొక్కర్తెనూ వుండలేనని చెప్పటం కావచ్చు. లేకపోతే మదరాసులో తోచకపోవటం కావచ్చు. దానిమీదట అతని చెల్లెలు "మమ్మల్నిప్పుడే మరచిపోయావా అన్నయ్యా? వదినపక్కనుండేటప్పటికి మేం కనబడకుండా పోయామూ! ముందొచ్చిన చెవులకంటే వెనకొచ్చిన కొమ్ములే యెక్కువ వాడని పెద్ద లూరకే అన్నారా?" అని వుత్తరం రాసింది.

ఆ వుత్తరం చూచేటప్పటికి అతనికి నవ్వొచ్చింది. యిదివరకు యే పరీక్షలకో చదువుతూ యింటికి వెళ్ళకపోతే యేమీ అనేవారు కాదు. మహా అంటె "ఒకసారి వొచ్చి చూచి వెళ్లకపోయావా?" అనేవారు. ఇప్పుడు తను రాకపోవటానికి భార్యే కారణమంటున్నారు.

తన వాళ్లు తన భార్యను ఇంతగా ప్రేమిస్తున్నారనుకోటం అతనికి సరదాగా వుంది. తన చెల్లెలు రాసిన వుత్తరం భార్యకి చూపించాడు. తన భార్య సంతోషిస్తుందనుకున్నాడు.

R. S. NARASU, M. A., LL. B.
EDUCATION OFFICER

ఆమె వుత్తరం చదివి తల పైకెత్తకుండానే "వెళ్ళి రాక పోయారూ!" అంది.

"ఒక్క రైనా ఉండలేనంటివిగా!"

"నాకోసం వెళ్లటం మానుకున్నారా!"

"మరింకెందుకు!"

"ఎందుకో మీకు తెలియాలి; మీవాళ్లకి తెలియాలి." ఆమె వుత్తరాన్ని తను తీసుకున్నంత తేలికగా తీసుకోటం లేదని అతని కప్పటికి అర్థమయింది. నవ్వులాటల్లోకి దించాలని యీ విధంగా అన్నాడు.

"వెళ్ళాలంటే నాకు తీరికేది? 'ఆఫీసు... భార్యా—కుటుంబం' ఇప్పుడనేక బాధ్యతలున్నాయి. నామీద ఇదివరకు లాగా ఒంటరిగాణ్ణా ఎప్పుడూ అక్కడుండటానికి!"

ఈవిధంగా మాట్లాడుతుంటే అతనికి తన పెదతండ్రీ, కుమారుడూ జ్ఞాపకం వచ్చారు. తనుకూడా తన అన్న ధోరణిలో పడుతున్నట్లు అనుమానం కలిగింది. వెంటనే సంభాషణ ఆపేశాడు. తన పెదతండ్రికి తాను రెండువందల రూపాయలిచ్చినట్లు భార్యకి చెప్పలేదు. మనస్సు కష్టపెట్టు కుంటుందేమోనని చెప్పకుండా వూరుకున్నాడు. ఇప్పుడు నెమ్మదిగా తనుకూడా భార్య యిష్టానికి వ్యతిరేకంగా నడవ టానికి జంకుతున్నట్టు అనుమానం కలిగింది. తప్పేముంది? ఇద్దరుకలిసి బతకాలంటే వొకరిమీద వొకరికి సానుభూతి వుండితీరాలి. ఇతరులమీద సానుభూతి వున్నమాత్రాన తల్లి దండ్రులమీద వున్న భక్తి తగ్గాల్సిన అవసరం లేదను

కున్నాడు. అయినా వొకసారి తన పెద తండ్రినీ. అన్ననీ చూచి రావాలనిపించింది.

కొన్నాళ్ళకు తన స్నేహితుని వివాహానికి వెళ్ళి తన పెదతండ్రి వుంటున్న వూరు, సమీపంలో వుందని తెలుసుకుని అక్కడకు వెళ్ళాడు. తన పెదతండ్రి ఒక పూరిపాకలో వుంటున్నాడు. అతన్ని చూచి పెదతండ్రీ, పెదతల్లీ చాలా సంతోషించారు. మాటామాటామీద పెదతండ్రి యిటీవల జరిగిన సంగతులన్నీ చెప్పాడు తనకీ తన కొడుక్కీ రాజీ కుదరలేదట.

ఆ మధ్య తల్లికి జబ్బుచేసి చావడానికి సిద్ధంగావున్నా కొడుకు చూడటానికి రాలేదట. డబ్బుకూడా పంపలేదట. తానిచ్చిన రెండువందల్లో చేబదులుకింద వందపోగా మందులకీ మాకులకే ఖర్చు అయిందట! పొలం మరామ్మత్తు లేక మామూలుగానే వుందట. పదిరోజుల్క్రిందట, తన కూతురు చూసిపోటానికని వస్తే రాకరాక వచ్చిందని తల్లిదండ్రులేమీ పెట్టలేదని, విచారపడుతుందని మిగిలిన కాస్త డబ్బు ఆమె కోసం ఖర్చుపెట్టారట! ఈ విషయాలన్నీ యదార్థాలేనని ఆయనతో మాట్లాడుతున్న రైతులు దృఢపరిచారు.

ఇటువంటి కొడుకుని మేమెక్కడా చూడలేదన్నారు! తండ్రిని పోషించని కొడుకు బతికేం చచ్చేం! ఆయనకి జరక్కపోతుందా? అవసరమొస్తే మేమే జరుపుతాం అన్నారు. "కొడుకుమీద వున్న మమకారం పోగొట్టుకోలేని ఆయన

కాబట్టి సరిపోయింది. ఇంకోళ్ళయితే కోర్టుకిలాగి ముప్ప తిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించేవాళ్లు" అన్నారు.

"వాణ్నేమీ అనకండి. ఎంతచెడ్డా వాడు నా కొడుకు. నా రోజులు మంచివి కాదు గాబట్టి వాడి కలుపంటి బుద్ధులు పుట్టిస్తున్నాడు" అన్నాడు పెదతండ్రి.

"చూశారా? వాళ్ళేంచేసినా వాళ్ళమీద మాట పడ నీయడు" అన్నాడు వొక రైతు.

పెదతండ్రి చూస్తుంటే కుటుంబరావుకి కళ్లు చెమ్మ గిల్లినై. తన దగ్గరవున్న యేభైరూపాయ లాయనకిచ్చి బంధు వుల్ని చూసివద్దామని గ్రామం బయలుదేరాడు. వెళ్ళబోయే ముందు అతన్ని చాటుకి పిలిచి పెదతండ్రి యిలా అన్నాడు.

"నాకు డబ్బిచ్చినట్టు వాడికి తెలియనివ్వకు నాయనా."

"తప్పేముంది పెదనాన్నా?"

"తా నివ్వకపోగా యితరుల దగ్గరనించి తీసుకున్నట్టు తెలిస్తే వూరుకోడు!"

"ఎందుకని?"

"తనకు నామర్దా అట. తాను తల్లిదండ్రులకు డబ్బి వ్వకుండా, కష్టపెడుతున్నట్టు పదిమందికి తెలుస్తుందట. తనకు పరువునష్టమట!"

"అలాగే పెదనాన్నా. తెలియనివ్వను" అన్నాడు. కుటుంబరావు లోలోపల తన అన్న చేస్తున్న పనికి వుడికి పోతూ.

అక్కడినించీ కుటుంబరావు స్వగ్రామం వెళ్ళి బంధువులందరినీ వొక్కసారి తిరగవేశాడు. బంధువులందరికీ తన అన్నమీద కష్టంగావుంది. డబ్బుకోసం తన అన్న చేస్తున్న అన్యాయాలూ, మోసాలూ చెప్పి మన వంశంలో చెడబుట్టాడని తేల్చివేశారు. వాళ్ళకుకూడా అతన్ని కోర్టుకి లాగి దుంప తెంచాలని వుందటగాని పెదతండ్రి వొప్పుకోవడం లేదని చెప్పారు.

"తండ్రితరపు బంధువుల్ని వొక్కర్నీ యింటికి రానివ్వడట. ఎవరైనా వెళ్ళినా భోజనమన్నా పెట్టకుండా పంపించి వేస్తాడట. భార్యతరపువాళ్ళని మాత్రం నెత్తిన పెట్టుకుంటాడట. ఊళ్ళోపార్టీల విషయంలో కూడా వాళ్ళకే మద్దతుచేస్తూ వుంటాడట. దిక్కుమొక్కుల వాళ్ళే వాడికి దేవుళ్లు" అని చెప్పారు.

ఈ మాటలన్నీ విని కుటుంబరావు సరాసరి తన అన్న వుద్యోగం చేస్తున్న పట్టణానికి ప్రయాణం కట్టాడు.

♦ ♦ ♦ ♦

"ఎక్కడనుంచోయ్" అని అడిగాడు రామారావు కుటుంబరావుని చూడగానే. రామారావు కుటుంబరావు పెదతండ్రి కొడుకు. ఆ పట్టణంలో మాస్టరుపని చేస్తున్నాడు.

కుటుంబరావు తన స్నేహితుని వివాహానికి వచ్చి చూసిపోదామని వచ్చానని చెప్పాడు. రామారావు వెంటనే యింట్లోకి వెళ్ళి పిల్లలను తీసుకొచ్చాడు. అతనికి ముగ్గురు

కూతుళ్ళూ, వొక కొడుకూ. కొడుకు పెద్దవాడు. కొడుక్కి 'బాబాయ్' అని చెప్పాడు. ఆడపిల్లలు ముగ్గురూ, బాబాయ్, బాబాయ్, అని చుట్టూ మూగారు కాని మొగపిల్లవాడు దూరంగా నిలబడి చూస్తూ నుంచున్నాడు.

"పిడికసీన్న మన బుద్ధులే వచ్చినయ్." అన్నాడు రామారావు తమ్ముడితో.

ఈ మాటకు కుటుంబరావు వులిక్కిపడ్డాడు. అన్నని తేరిపారచూశాడు. రామారావు చెప్పాడు.

"తనకి తోచదు, వొకళ్లు చెపితే వినడు. తాపట్టిన పట్టేపట్టు. కలుపుగోలుతనం బొత్తిగాలేదు. చూస్తూ చూస్తూ యెవరికీ గౌరవము యివ్వలేడు. ఎలా బతుకుతాడో" అన్నాడు.

ఈ మాటలకు కుర్రవాడికి కోపంవచ్చి తండ్రిని చుర చుర చూస్తూ లోపలికి వెళ్లాడు. ఇంతలో లోపలనుంచి వదిన వచ్చి కుశలప్రశ్నలు వేసింది, కుటుంబరావుని.

"బాగున్నావా అబ్బాయి!"

"ఆ"

"నాన్నా, అమ్మా అంతా బాగున్నారా!"

"ఆ"

"ఇప్పుడెక్కడ ఉద్యోగం"

కుటుంబరావు చెప్పాడు.

"అమ్మాయి నీతోనే వుంటుందిగా!"

"ఆ"

"నువ్వు చిత్తూరు వచ్చినతర్వాత మీ అమ్మకాని నాన్నగాని ఎప్పుడన్నా వచ్చిపోయారా?"

"లేదు"

"వాళ్లు రారు" అన్నాడు రామారావు.

"మీదంతా చోద్యం" అంది అతని భార్య.

"కాదు నాకుమల్లేనే వాడూ భార్య కాపరని కొచ్చిం తరువాత మారిపోయాడని ఈపాటికి తెల్సుకొని వుంటారు" అన్నాడు చిరునవ్వునవ్వుతూ రామారావు.

"మీ అన్నయ్యమాటలెప్పుడూ అట్లాగనే వుంటాయి లే! లే స్నానం చేద్దువుగాని" అన్నది ముసిముసినవ్వులు నవ్వుతూ.

"లే బాబాయి, రా బాబాయి" అని పిల్లలు కుటుంబ రావు చేతులు పట్టుకొని లాగటం మొదలు పెట్టారు. స్నానం సంధ్యలయిన తరవాత అన్నదమ్ములిద్దరూ భోజనానికి లేచారు. భోజనంచేసేటప్పుడు అన్నదమ్ములిద్దరూ చిన్నప్పటి సంగతులు జ్ఞాపకం చేసుకున్నారు. తమ గ్రామ పరిస్థితులూ బంధువుల స్థితిగతులూ చెప్పుకున్నారు.

మనవూరు ఇదివరకు మల్లేలేదు. మన కుంటుబాలు మరీ ఖాత్రిగా చెడిపోయినయి. ఆర్థికంగా చితికిపోయి అనేక అవలక్షణాలకు స్థావరమయినాయి. ఈర్ష్య, అసూయ ద్వేషం, ఇవే మనవాళ్ళ ప్రస్తుతలక్షణాలు. పరాయివాళ్లు, సొంతవాళ్లు

అని లేకుండా మెవరు కొద్దిగా బాగున్నావాళ్ళ నాశనాన్ని కోరటమే మిగిలినవాళ్ళ పనిగా వుంది. ప్రస్తుతం మన కుటుంబాల్ని చూస్తుంటే వొకప్పుడు వైభవోపేతంగా ఉండి శిథిలాలైన పురాతన కట్టడాలు జ్ఞాపకం వస్తున్నాయి. వాటిని చూస్తుంటే జాలివేస్తుంది. కాని ఏం లాభం? మరామత్తు చేయటానిక్కూడా వీలులేనంత ముక్కలై మట్టిలో కలిసిపోతున్నాయి" అన్నాడు రామారావు.

అతని భార్య చిరునవ్వునవ్వుతూ "మీరుచెడిపోయింది చాలక అబ్బాయిని చెడగొడుతున్నారా!" అన్నది

"నేను చెడిపోయాననే అంటావా!" అన్నాడు రామారావు.

"మీవాళ్ళ నడిగితే తెలుస్తుంది" అంది భార్య.

"నీ ఉద్దేశ్యం చెప్పు" అన్నాడు రామారావు.

"ఆయన మాటలు వినబోకబ్బాయి"అంటూనవ్వుతూ వెళ్ళిపోయింది.

అన్నదమ్ము లిద్దరూ భోజనం పూర్తిచేశారు. గదిలో తనకోసం వేసిన పక్కమీద ఆలోచిస్తూ పడుకున్నాడు కుటుంబరావు. తన అన్నయ్య మారాడు; పూర్తిగా మారాడు. కాని ఆమార్పు యితరులు చెపుతుంటే కనిపించినంత భయంకరంగా కనిపించటంలేదు. ఇలా ఆలోచిస్తూ ప్రయాణబడలికమీద ఉన్నాడేమో కళ్ళు మూశాడు. మధ్యలో మెలకువ వచ్చింది. పక్కగదిలోమెవరో మాట్లాడు

కుంటున్నారు. గొంతుకలనుబట్టి తన పెదతండ్రి, అన్నయ్యలని గ్రహించాడు.

తన పెద తండ్రి యిలా అంటున్నాడు.

"50 రూపాయ లివ్వనాయనా! మళ్ళీ యిప్పట్లో అడగను"

"మొన్న తీసుకెళ్ళిన డబ్బు ఏం చేశావు?"

"ఏం చెప్పను నాయనా, నీ దగ్గర తీసుకొని మన వాళ్ళను చూసి వద్దామని మనవూరు వెళ్లాను. మా మేన మామయింట్లో భోంచేసి కళ్ళుమూశాను. లేచి చూచేటప్పటికి డబ్బులేదు. ఎవర్నడగను నాయనా? అంతా దగ్గిర బంధువులు. ఇంతకీ నా ప్రారబ్ధం."

ఈ మాట రామారావునమ్మినట్టులేదు. "వ్యాజ్యానికి ఖర్చు పెట్టలేదు. గదా!"

"లేదు నాయనా! నువ్వొద్దన్న పని చెయ్యటమా?"

"వూళ్లో వాళ్ళకి అప్పిచ్చి ఉంటావు"

"అబ్బే! రామరామ! వాళ్ళ మాటలు నమ్ముతానా? నీ కష్టార్జితం తీసుకొని వాళ్ళ చేతుల్లోకి పోనిస్తానా? నువ్వే మనుకున్నా నువు బాగా డబ్బు సంపాయించి పెద్ద వాడవవ్వాలనే ఉంటుంది నాయనా నాకు. తండ్రినే! చేతులారా పెంచానే! నిన్ను కష్టపెట్టాలని ఉంటుందా నాయనా నాకు"

రామారావు మాట్లాడలేదు. డబ్బుతీసుకు రావటానికి లోపలికి వెళ్లాడని గ్రహించాడు కుటుంబరావు. అతని కంతా

గొడవగా ఉన్నది. యిదమిద్ధమని తేల్చుకోలేక పోతున్నాడు. పెదతండ్రి యెదుటబడితేగాని యదార్థం తేలదని బయటి కొచ్చాడు. రామారావు ఇంట్లోనించి డబ్బు తెచ్చి తండ్రి కిచ్చాడు. ఆయన డబ్బుతీసుకొని యిలా అన్నాడు.

"నీ చేత యింతడబ్బు ఖర్చుపెట్టించటం నాకుయిష్టం లేదు. నాయనా! నా మట్టుకి నాకు నీ దగ్గరే ఉండాలనిఉంది కృష్ణా! రామా! అనుకుంటూ. నీపిల్లల్ని చూస్తూవుండటం కంటె నాకేం కావాలి? కాని మీఅమ్మ పడనివ్వదు. దాని స్వభావం నీకు తెలుసుగా నాయనా! నాది అనేది ఉండా లంటుంది. ఒకళ్ళ పంచను బతకనంటుంది. ఏం చెయ్యను నాయనా? అది బాగా బతికిన మనిషి. ఈ అవసానకాలంలో దాన్ని కష్టపెట్టం నాకు యిష్టలేదు."

అంతలో కుటుంబరావుని చూశాడు. తననుచూచి పెద తండ్రి నివ్వెరపోతాడనుకున్నాడు. కాని అలాజరగలేదు. చాలా కాలంనుంచి చూడనట్టుగా "ఎప్పుడొచ్చావురా?" అని అడిగాడు.

"ఇప్పుడే."

"మీనాన్న బాగున్నాడా!"

"ఆ"

"ఒక్కసారీ మమ్మల్ని చూడటానికి రాడు. ఇప్పుడు వాడికి కనబడుతున్నామటలే" అన్నాడు.

"ఆయన కనేక పనులుంటాయి. తీరొద్దూ?" అనిసర్దటా నికి ప్రయత్నించాడు రామారావు.

"చూడాలని ఆపేక్ష. ఉంటే తీరిక లేకుండా ఉంటుందా? వాడి చదువుకోసం మేంపడినకష్టం నీకేం తెలుసు! వాడు చదువుకుని ప్రయోజకుడవాలని అవిభక్తకుటుంబం డబ్బుతో చదువు చెప్పించాము. మాకు అప్పయినది వాడి మూలాన కాదూ? వాడి చదువుకోసం తెచ్చిన డబ్బే పెరిగి పెరిగి యావత్తు ఆస్తిని దిగమింగింది. ఈనాడు మేమిల్లాఏడుస్తున్నామంటే కారణం వాడు కాదూ? కాని వాడికి విశ్వాసము లేదు. మేము తింటున్నామో తినటంలేదో, చస్తున్నామో, బతుకుతున్నామో చూచిపోదామన్నా లేదు. తనేమో, తన పెళ్ళామేమో, తన పిల్లలేమో" అన్నాడు.

కుటుంబరావు కేమీతోచలేదు. తలవంచుకొని మెదలకుండా రామారావు కెదురుగుండా కూర్చున్నాడు.

"సొంత కొడుకుని సాధించటం అయింది. తమ్ముని కొడుకుని సాధిస్తున్నారా?" అన్నది రామారావు భార్య తలుపు చాటునుంచి.

ఆమె మాట వినగానే "వెళ్లొస్తా నాయనా" అని లేచాడు పెదతండ్రి.

"భోంచేసి వెళ్ళండి" అన్నది రామారావు భార్య.

"ఎప్పుడూ లేని మర్యాద ఇప్పుడొచ్చిందే" అన్నాడు పెదతండ్రి.

"అదేమిటి నాన్నా ... ... ..." అని మొదలుపెట్టాడు రామారావు.

"నువ్వేమీ భార్యను వెనకేసుకు రానక్కరలేదు

లేపోయి, వాడిదగ్గర తన మర్యాదను చూపించాలని భోజ నానికుండమంది. ఎప్పుడన్నా ఉండమన్నదీ!" అని లేచివెళ్ళి పోయాడు.

"చూశావా అబ్బాయి ఎవరన్నా ఉంటే ఇదీ వరస. ఎవరూ లేకపోతే చక్కగా భోంచేసి వెళతారు. యింతకీ ఒక ర్నని ప్రయోజన మేముంది? ఈయనలోనే ఉంది మెతక. ఆయన అడిగినంత డబ్బు యిస్తారు. ఆ డబ్బు తీసుకుపోయి అందరికీ లేనిపోనివి చెబుతారు. ఏం చెప్పినా ఈయనేమో చూస్తూ వూరుకుంటారు" అన్నది.

అన్నదమ్ములిద్దరూ మెదలకుండా కూర్చున్నారు. కుటుంబరావు తలెత్తి చూచేటప్పటికి తన పెదతండ్రి బజారులో నిలబడి రమ్మని చేత్తో సౌంజ్ఞ చెయ్యటం కనిపించింది. అతను నెమ్మదిగా లేచి బయటికి వెళ్లాడు.

"చూశావా నాయనా? అదీవరస. ఎంతచెడ్డా మామ గదా! దాన్ని చూడు అది యెదటనిలబడి కవ్వించి ఎట్లా మాట్లాడుతుందో. నీదగ్గర తాను మంచిదాన్ననీ, తప్పంతా నాదేననీ ఋజువుచెయ్యటానికి అది యీా యెత్తెత్తింది నేను పడతానా, దాని ఎత్తులో?... పుల్లల్లే ఉండేవాడు. దాని చేతులోబడి ఎలా పిల్లయ్యాడో చూడు. అది అట్టా వసపోసిన పిట్టల్లే వాగుతుంటే, వాడొక్కమాటన్నా అన్నాడేమో చూడు."

కుటుంబరావు ఏమీమాట్లాడలేదు. పద్మవ్యూహంలో

చిక్కుకున్నట్లు ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. అతీగతీ చెప్పకుండా నుంచునేటప్పటికి పెద తండ్రికి అనుమానం కలిగింది. దగ్గరకు వొచ్చి అతని బుజంమీద చెయ్యేసి ఇలాఅన్నాడు- "నిన్నీ మధ్య చూడనట్టు పలకరించానని ఏమన్నా అనుకుంటున్నావా నాయనా? ఏం చెయ్యను? వాడు ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేరకం. నిన్నింతకుముందే కలిసినట్లు తెలిస్తే నీలో తనమీద ఏవో చెప్పి వుంటానని అనుమానపడి గడపతొక్కనివ్వడు. ఇంతబతుకూ బతికి ముసలితనంలో అందరికీ జడిసి బతకాల్సి వచ్చింది నాయనా!" అని కన్నీరు పెట్టుకుంటూ "చూడు నాయనా—వాడెంత టక్కరో! ఎప్పుడొచ్చినా ఉత్త చేతులతో పంపేవాడు. ఇవ్వాళ నువ్వు ఉన్నావని ఏమైనా అనుకునిపోతావని అడగగానే యాభైరూపాయలు ఇచ్చాడు" అన్నాడు. "అదేమిటి పెదనాన్నా! నేను రాకముందే ఇస్తేనూ!" అన్నాడు కుటుంబరావు.

ఆ మాటకు పెదతండ్రికి కోపం వచ్చింది. ఇంత ఎత్తున ఎగిరిపడ్డాడు. "నువ్వు రాకముందేయిచ్చాడూ!నువ్వుచూశావూ! ఈ కళ్ళతో నేనా చూచింది! నేను అనుకుంటూనేఉన్నా. ఆమాటా యీమాటా చెప్పి అది నిన్ను బుట్టలో వేసుకొని ఉంటుందని. మా కడుపున మీలాంటి ఆడంగివాళ్ళు ఎట్లా పుట్టార్రా!" అని గబగబా వెళ్ళిపోయాడు.

కుటుంబరావు వెళ్ళిపోతున్న పెద తండ్రిని చూస్తూ నిలబడి పోయాడు.

"డబ్బు అడిగాడా ఏమిటోయ్?" అని ప్రశ్నించాడు రామారావు యింట్లోకి వస్తున్న కుటుంబరావుని చూచి.

"ఎవ్వరు?" అని అడిగాడు కుటుంబరావు.

"నాన్న"

లేదు అన్నట్లు అడ్డంగా తలూపాడు కుటుంబరావు.

"చెప్పాడా?" అని మళ్ళీ అడిగాడు రామారావు.

"ఏమిటి?"

"నా సంగతి" అన్నాడు రామారావు చిరునవ్వు నవ్వుతూ.

"ఎందుకు చెప్పరూ! ఆయన పనే అదైతే" అన్నది రామారావు భార్య.

కుటుంబరావు ఒదిన వంకకు చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వుతూంది. తన అన్నని చూశాడు. అతడు వినటానికి సిద్ధంగా కూచున్నాడు. కుటుంబరావు తికమకపడి తలవొంచుకొని, "ఎందుకొచ్చిన గొడవ ఇదంతా. ఆయనకి సంవత్సరానికి ఇంతని యిస్తే తీరిపోతుంది" అన్నాడు.

ఈ మాటకు రామారావుభార్య భర్తనిఓరగాచూచింది. చిరునవ్వు నవ్వింది. అతను తనతండ్రి కుటుంబరావు, ముందు గ్రంథం విప్పి ఉంటాడని గ్రహించాడు. తన తమ్ముడు తన్ను అపార్థం చేసుకోవటం అతనికి యిష్టం లేకపోయింది. చెప్పాడు.

"నా సంగతి నీకు తెలుసు. డబ్బుకూడబెట్టటమే జీవిత ధర్మం అని నేను అనుకోను. డబ్బుకంటే గొప్పవిలువిలు కొన్ని వున్నాయని నా విశ్వాసం. అందులో ముఖ్యమైంది

మానవత్వం. మానవత్వం చంపుకున్న మనిషి. మనిషి కాదనీ పశుప్రాయుడనీ నా అభిప్రాయం. జీవితంలో నన్ను ఎదుర్కొంటున్న సమస్యల్ని నేనీ దృష్టితోనే చూస్తాను. అయినప్పటికీ నాన్నని సంతృప్తి పరచలేకపోయాను. ఇది నాన్నకీ నాకూ మధ్య జరుగుతున్న ఘర్షణకాదు. దేశమంతటా జరుగుతూనే ఉంది.

"తండ్రులకీ కొడుకులకీ ఇప్పుడు ఏర్పడినంత అగాధం యిదివర కెన్నడూ ఏర్పడలేదు. దృష్టిలో, అభిప్రాయాల్లో ఇప్పుడున్నంతభేదం ఎప్పుడూ లేకపోవటమే దీనికికారణం. మన ముత్తాతలనుంచీ మన తండ్రులవరకూ స్వల్ప మార్పులతో సంఘం పరిణామం చెందింది. అందుకనే తండ్రీ కొడుకులమధ్య అట్టే పొరపులు లేకుండా కాలం గడిచింది. భయంతోనూ, భక్తితోనూ కొడుకు తండ్రి ఆజ్ఞలకు తలవొగ్గేవాడు. కొడుకులలో కలుగుతున్న చిన్నచిన్న మార్పులను చూచీ చూడనట్టు వూరుకునేవాడు తండ్రి. ఇప్పుడలాకాదు. అతివేగంగా మార్పులు జరుగుతున్నై. తాము నమ్మిన ఆచారాలు, తమను ఉద్రేకపరచిన సిద్ధాంతాలు తమ కళ్ళముందే తారుమారు అవుతూ ఉండటంవల్ల తండ్రులు తికమక పడుతున్నారు, కాలంతోపాటు మారలేక పోతున్నారు. పరిస్థితులు సరిగా వాళ్లు అర్థంచేసుకోలేక పోతున్నారు.

నాన్నకిదే జరిగింది. ఆయున్ని నేనునిందిస్తున్నాను అనుకోకు. నా అభివృద్ధికి ఆయనఉన్నపరిస్థితుల్లో ఏ తండ్రి కృషి చెయ్యాని విధంగా కృషి చేశాడు. అది నేను కాదనను. కాని

నా జన్మకాయన కారణంగనక ఆయనకు మంచిగా కనపడేవన్నీ నాకు కూడా మంచిగా కనపడాలంటే మాత్రం చిక్కొస్తుంది.

నాకు ఉద్యోగం వొచ్చినప్పటినుంచీ నాన్నని నాతో ఉండమని బ్రతిమాలుతున్నాను. కాని మొదట్లో ఆయన వొప్పుకోలేదు. 'ఇంత బ్రతుకూ బ్రతికి కొడుకు పంచన పడి ఉండమంటావా?' అనేవాడు. 'కోడలి చేతి మెతుకులు తిన మంటావా, అందులో దుక్కముక్కలవారి ఆడపడుచే' అనే వాడు. ఆ రోజుల్లో నే నేమన్నా డబ్బివ్వబోతే 'నువ్వు యిచ్చేవాడివీ నేను తీసుకునేవాణ్ణీనా' అనేవాడు. అంత పౌరుషంగా ఉండేవాడు.

కాని కొద్దిరోజుల్లోనే ఆస్తి వొక సెంటుకూడా లేకుండాపోయింది. జరుగుదలే కష్టం అయింది. సంగతి తెలియ గానే, నేనూ నీ వదినా వెళ్ళి బ్రతిమాలి మన యింటికి తీసు కొచ్చాం. తీసుకొచ్చాం అన్నమాటేగాని మాకూ వాళ్ళకీ కూడా సుఖం లేకుండా పోయింది. వొచ్చిన దగ్గరనుంచీ వాళ్లు నీ వొదినెను సాధించటం మొదలుపెట్టారు. నీ వొదినె దుక్కముక్కలవారి ఆడపడుచని నీకు తెలుసు. వాళ్ల కుటుం బాలకూ, మన కుటుంబాలకూ తరతరాలనుంచీ విరోధమని నీకు తెలుసు. నాన్న నిద్రలోకూడా ఈ విరోధం మరచిపోయే వాడుకాదు. ఆ విరోధంతో ఆయన పెరిగాడు. పెద్దవాడ య్యాడు. ఈ నాడు మారుదామనుకున్నా మారలేదు.

ఈ విరోధం మనస్సులో పెట్టుకొని దాన్ని ప్రతిచిన్న విషయానికీ సాధించేవాడు. 'ఈనాటికి నువ్వు పెట్టేదానివి - నేను తినేవాణ్ణి అయ్యాం' అనేవాడు. 'నీ ముత్తాత నా ముత్తాత చేలో పరిగె ఏరుకున్నాడు' అనేవాడు. 'మీవాళ్ళు గడ్డి తిని డబ్బు సంపాదించారు. వాళ్ళలాగు గడ్డితింటే నేను ఈ పాటికి లక్షలు గడించేవాణ్ణి' అనేవాడు. ప్రతి విషయం లోనూ అది డబ్బు ఖర్చుపెట్టడానికి వెనకాడుతూ వుందని వూహించుకునేవాడు. పోట్లాడేవాడు. తన తండ్రిని నోటికి వచ్చినట్లు అంటుంటే విని సహించలేక జవాబు చెప్పితే వెంటనే నాతో ఫిర్యాదు చేసేవాడు. 'అటువంటి దాన్తో ఇన్నాళ్ళనుంచీ నువ్వెట్లా కాపురం చేస్తున్నావురా?' అని అడిగేవాడు. 'ఈ ఇంట్లో అదైనా వుండాలి. నేనైనా వుండాలి' అని పంతం పట్టుకు కూర్చునేవాడు.

నేనేం చేసేది? నాన్నని కూర్చోబెట్టి అనేకసార్లుచెప్పి చూశాను. ఆయనకు నా మాటలు అర్థంకాలేదు. పైగా నేను భార్యని వెంటవేసుకొస్తున్నానని నామీద లేచాడు. ఆ రోజు మొదలుకొని నేను నా భార్యకి దాసుడననీ, దాని మాటలు విని నానాబాధలూ పెడుతున్నాననీ, తిండికూడా సరిగా పెట్టడంలేదనీ, ఆడదాని అడుగులకు మడుగులొత్తే చీమూ నెత్తురూ లేనివాణ్ణనీ అందరికీ చెప్పటం మొదలు పెట్టాడు.

"ఇవన్నీ సహించాం, వాళ్ల స్వభావం అంతేలనివూరుకున్నాం. చాటుమాటుగా ఇవన్నీ నామీద చెపుతూ,

ఎదురుపడితే నేనంటే బాగానే వుండేవాడు నాన్న. ఇలా వుంటూ నా కొడుకుని దగ్గరకు తీసి వాడికి వాడి తల్లిమీద లేనిపోని కొండీలు చెప్పి మనసు విరిచాడు. పసివాడవటంవల్ల వాడు నాన్న చెప్పేమాటలన్నీ నమ్మాడు. నమ్మి వాళ్ళ అమ్మకు ఎదురు తిరిగి పోట్లాట్టం మొదలుపెట్టాడు. తల్లి వాడికి గిట్టకుండా పోయింది. అంతవరకూ ఎలాగో సహించిన నీ వొదిన ఇక సహించలేకపోయింది. నేను నానకు 'కొడుకుని తల్లిమీదకు ఉసికొల్పటం ధర్మంకాదని' చెప్పాను. ఆయన నాదగ్గర తను ఏమీ ఎరగననీ, గిట్టక తన్ను వెళ్ళ గొట్టాలనే ఉద్దేశంతో నీ భార్య ఇదంతా కలిపించిందని చెప్పాడు. కాని నేను బయటకు అడుగుపెట్టగానే మళ్ళీ మొదలు.

ఇవన్నీ చూస్తే నాకూడా అమ్మనీ నాన్ననీ వేరుగా ఉంచటంకంటే గత్యంతరం కనిపించలేదు. ఒకసారి అమ్మాయి వస్తే తీసుకువెళ్ళి ఒక నెలరోజులు ఉంచుకోమని చెప్పాను. అమ్మాయికీ అమ్మాయిభర్తకీ నాన్నంటే అమితభక్తి అని నీకు తెలుసు. అటువంటివాళ్ళుకూడా పదిరోజుల కంటే ఎక్కువ ఉంచుకోలేకపోయారు. అక్కడా ఇదే ధోరణి. అమ్మాయి భర్తని ఎంతమాటపడితే అంతమాట అనేవాడట, అతను మాంసం తింటాడు. అతనికి మాంసం వొండిపెట్టవద్దని అమ్మాయితో పోట్లాడేవాడట. మన ఇళ్ళల్లో మాంసం అలవాటులేదు. అందుకని మనకోసం అంతా మానుకుంటారా? మాంసం వొండితే మీ ఇంటిలో అన్నం తిననూ, అని పట్టు

పట్టుకు కూర్చునేవాడట. మాంసం తినేవాళ్ళని అనరాని తిట్లు తిట్టేవాడు. మాటలు పడలేక అమ్మాయి వాళ్ళని పంపించివేసింది, తన భర్తను పురుగును ఏరిపారవేసినట్లు ఏరి పారవెయ్యటం అది సహించలేకపోయింది. అక్కడనుంచీ వేరుగానే ఉంటున్నారు. తనకు తోచినప్పుడు తోచినట్లు డబ్బు అడుగుతాడు. నేను యిస్తూవుంటాను. కాని నేను మాత్రం ఎంతని ఇవ్వగలను!" అని నిట్టూర్పు విడిచాడు రామారావు

ఈ సంగతులన్నీ వింటూవున్న కుటుంబరావుకి కొంచెం గుక్క తిరగలేదు. తెరమరుగున తనకు తెలియని విషయాలు ఇన్ని ఉంటాయని అతను యెప్పుడూ అనుకోలేదు. తన అన్న వేసిన ఆఖరి ప్రశ్నకీ, విడిచిన నిట్టూర్పుకీ జవాబుగా, "ఆయనకుమాత్రం ఎంతడబ్బు కావాలి! ఆయనకీ పెద్దమ్మ కేగా!" అన్నాడు.

"అంతవరకైతే పరవాలేదు. కాని ఆయన నాదగ్గర కనిపెట్టి వసూలు చేస్తున్నాడు. నన్ను రచ్చకీడ్చి నలుగురు నోళ్లల్లో పడవెయ్యటమే తనపనిఅన్నట్లు ప్రవర్తిస్తున్నాడు. నాదగ్గర డబ్బు తీసుకువెళ్తాడు. ఊళ్లో తనపక్షం మాట్లాడే వాళ్లకి పదులూ, అయిదులూ చేబదుళ్ళిచ్చి వాళ్లు నన్ను తిడుతుంటేతాను సంతోషిస్తుంటాడు. డబ్బు అయిపోగానేమళ్లీ వొస్తాడు. డబ్బుఅడుగుతాడు. ఇదీఅట" అన్నాడురామారావు.

"ఆయనపేర కొద్దిగా పొలంవుందని విన్నాను" అన్నాడు కుటుంబరావు.

"అద్దాశ వుండు. ఆ పొలం పండదు. ఎంత చెప్పినా వినడు. ప్రతి సంవత్సరం వందా రెండువందలైనా ఖర్చుపెడ తాడు దానికోసం. శిస్తులకుకూడా డబ్బు చాలదు. మళ్ళీ నేను ఇవ్వవలసిందే. ఎవరన్నా అడిగితే 'మనిషన్న తరువాత పది ఎకరాలన్నా లేకపోతే ఎట్లా' అంటాడట. 'పండదని పొలం వొదులుకుంటామా' అంటాడట. నేనేం చెయ్యను? నేను మాత్రం ఎంత డబ్బివ్వగలను? నా సంపాదనా, నీ వదిన ఆస్తి మీదవచ్చే అయివేజు కలిపి నా కుటుంబ ఖర్చులకే చాలదు. ఆయనంటే మనకు గౌరవమే. కాని గౌరవంగా చూసే అవ కాశం ఆయన మనకివ్వాలి. ఆయన బాధ్యతేకాక, ప్రపం చంలో మనకీ మరికొన్ని బాధ్యతలుగూడా ఉన్నాయని ఆయన గ్రహించాలి. లేకపోతే......"

"అన్నదమ్ములిద్దరూ మాట్లాడకుండా కూర్చున్నారేం" అని అడిగింది, రామారావు భార్య.

"దుక్కముక్కలవారి సంగతి ఆలోచిస్తున్నాంవదినా" అన్నాడు కుటుంబరావు.

"అబ్బాయికి చెప్పారా ఏమిటి?"

"ఆ-అన్నీ చెప్పాను. తెలిసివుండటం ఎందుకయినా మంచిది."

"ఏం మంచండీ! మీకుమల్లే భార్యమాటలువిని చెడిపో టానికా" అన్నది దుక్కముక్కలవారి ఆడబడుచు చిరునవ్వు నవ్వుతూ!